బలగం BALAGAM TV
నిజమే మా బలం.. ప్రజలే మా బలగం
BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com
హైదరాబాద్ శనివారం 11 జనవరి 2025 | www.balagamtv.com | పేజీలు 4

## విద్యాశాఖ కార్యదర్శిగా యోగితారాణా బాధ్యతల స్వీకరణ

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

విద్యాశాఖ కార్యదర్శిగా ఐఏఎస్ అధికారి యోగితా రాణా శుక్రవారం హైదరాబాద్‌లో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమెకు పాఠశాల విద్యాశాఖ సంచాలకులు ఈవి నరసింహారెడ్డి, ఇంటర్ బోర్డు కార్యదర్శి కృష్ణ ఆదిత్య, ఇతర అధికారులు, ఉన్నత విద్యామండలి కార్యదర్శి ప్రొఫెసర్ శ్రీరాం వెంకటేశ్ కలిసి అభినందనలు తెలిపారు. పాఠశాల విద్యాశాఖ, ఇంటర్ బోర్డు పరిధిలో ప్రస్తుతం ఉన్న సమస్యలపై వారు చర్చించారు. ముఖ్యంగా పదో తరగతి, ఇంటర్మీడియెట్ వార్షిక పరీక్షల నిర్వహణ గురించి చర్చకు వచ్చింది. ప్రస్తుతం ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) రాతపరీక్షలు ఆన్‌లైన్‌లో జరుగుతున్నాయి. వాటి గురించి అధికారులు వివరించారు. ఎప్‌సెట్ సహా వివిధ ప్రవేశవ పరీక్షల తేదీలకు సంబంధించిన షెడ్యూల్‌ను ఉన్నత విద్యామండలి రూపొందించి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆమోదానికి పంపించిన విషయం తెలిసిందే. వాటి గురించి యోగితారాణాకు శ్రీరాం వెంకటేశ్ గుర్తు చేశారు. ఇంకోవైపు విశ్వవిద్యాలయాల ఉపకులపతుల (వీసీ)తో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమావేశం కావాల్సి ఉందనీ, దాని గురించి ప్రస్తావించినట్టు తెలిసింది.

## సమస్యలు తెలుసుకోవడానికి
# కలెక్టర్లు క్షేత్రస్థాయిలో పర్యటించాలి

- ఉపాధి హామీ రైతు కూలీలకు ఇందిరమ్మ రైతు భరోసా
- గ్రామసభల్లోనే ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారుల ఎంపిక
- అనర్హులకు పథకాలు వర్తించరాదు
- సీఎం రేవంత్‌రెడ్డి
- కలెక్టర్లతో సీఎం సమావేశం



**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

సంక్షేమం, అభివృద్ధి ప్రభుత్వానికి రెండు కళ్ల లాంటివని, ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డుల జారీ, ఇందిరమ్మ ఇండ్ల వంటి కీలకమైన నాలుగు సంక్షేమ పథకాల అమలులో జిల్లా కలెక్టర్లు క్రియాశీల పాత్రను పోషించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ్ఞ చెప్పారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి గారి అధ్యక్షతన కలెక్టర్ల సమావేశం జరిగింది. తెలంగాణలోని వ్యవసాయ యోగ్యమైన భూములకు ఎకరాకు రూ.12 వేల చొప్పున రైతు భరోసా చెల్లించాలని, అలాగే, వ్యవసాయానికి పనికి రాని భూములను గుర్తించి వాటిని రైతు భరోసా నుంచి మినహాయించాలని ముఖ్యమంత్రి గారు చెప్పారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద రూ. 12 వేల చొప్పున చెల్లించాలని, ఈ రెండు పథకాలు జనవరి 26 న రిపబ్లిక్ డే నుంచి అమలు చేయాలని చెప్పారు.

ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్కతో పాటు ఇతర మంత్రులు పాల్గొన్న ఈ సమావేశంలో ఆయా పథకాల అమలులోని ప్రాధాన్యాలు, తీసుకోవలసిన చర్యలను ముఖ్యమంత్రి కలెక్టర్లకు మార్గనిర్దేశం చేశారు. ఈ నాలుగు పథకాల అమలు కోసం రాష్ట్రంలోని అన్ని గ్రామాల్లో గ్రామసభలు, మున్సిపాలిటీల్లో వార్డు సభలు నిర్వహించేందుకు వెంటనే సన్నాహాలు చేసుకోవాలని ముఖ్యమంత్రి కలెక్టర్లకు ఆదేశాలిచ్చారు. "వ్యవసాయయోగ్యం కాని రియల్ ఎస్టేట్ భూములు, లే అవుట్ చేసిన భూములు, నాలా కన్వర్షన్ చేసిన భూములు, మైనింగ్ చేస్తున్న భూములు, గోదాములు నిర్మించిన భూములు, వివిధ ప్రభుత్వ ప్రాజెక్టుల కోసం సేకరించిన భూముల వివరాలను సేకరించాలి. ప్రతి మండలానికి ఒక నోడల్ అధికారిని నియమించాలి. గ్రామ పంచాయతీ, మున్సిపాలిటీల రెవెన్యూ రికార్డులు, సంబంధిత విభాగాల రికార్డులన్నీ క్రోడీకరించుకోవడంతో పాటు విలేజ్ మ్యాప్‌లను పరిశీలించడం, అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి వాటిని ధ్రువీకరించుకోవాలి.

వ్యవసాయ యోగ్యం కాని భూముల జాబితాలను పక్కాగా తయారు చేసి గ్రామ సభల్లో ప్రచురించాలి. వీటిని గ్రామ సభల్లో చర్చించి వెల్లడించాలి. ఇందులో ఎలాంటి అనుమానాలు, అపోహలకు తావు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. రైతు పంట వేసినా, వేయకపోయినా వ్యవసాయ యోగ్యమైన ప్రతి ఎకరానికీ రైతు భరోసా ఇవ్వాల్సి ఉంటుంది. వ్యవసాయ యోగ్యం కాని భూములకు కూడా గతంలో పెట్టుబడి సాయం అందించారు. అనర్హులకు ప్రయోజనం అందించకూడదు. అనర్హులను గుర్తించాల్సిన అవసరం ఉంది.

భూమి లేని నిరుపేద ఉపాధి కూలీ కుటుంబాలను ఆదుకునేందుకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాన్ని ప్రారంభించాం. ఆ కుటుంబానికి ఏడాదికి రూ.12 వేల నగదు సాయం అందించాలి. ఏడాదిలో కనీసం 20 రోజులు ఉపాధి హామీ పనులు చేసిన భూమి లేని కుటుంబాలకు ఈ పథకం వర్తిస్తుంది.రాష్ట్రంలో 'వన్ స్టేట్ – వన్ రేషన్' విధానాన్ని అమలు చేయబోతున్నాం. తెలంగాణలో ఒకరికి ఒకచోట మాత్రమే రేషన్ కార్డు ఉండాలి. ఈ నెల 11 నుంచి 15 లోగా పథకాల అమలుకు కావలసిన ప్రిపరేటరీ పనులను పూర్తి చేసుకోవాలి.

ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డు లబ్దిదారుల జాబితాలను కూడా గ్రామ సభల్లో బహిర్గతం చేయాలి. 24వ తేదీలోగా గ్రామ సభలు పూర్తి చేయాలి. గూడులేని నిరుపేదలకు ఇళ్లను నిర్మించి ఇవ్వాలనేది ప్రభుత్వ లక్ష్యం. ఇప్పటికే ఇందిరమ్మ యాప్ ద్వారా గుర్తించిన 18.32 లక్షల మంది వివరాలను జిల్లాలకు పంపించాం. అందులో అత్యంత నిరుపేదలకు మొదటి ప్రాధాన్యమివ్వాలి. తొలి విడత నియోజకవర్గానికి 3500 ఇండ్లను మంజూరు చేశాం.

ఇందిరమ్మ ఇండ్లకు అర్హులైన వారి జాబితాలను వెంటనే సిద్ధం చేయాలి. ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించి అర్హుల జాబితాను ఇంచార్జీ మంత్రికి అందించాలి. ఇంచార్జీ మంత్రి గారి ఆమోదంతోనే కలెక్టర్లు అర్హుల జాబితాను విడుదల చేయాలి. సంక్షేమం, అభివృద్ధిని ప్రభుత్వం రెండు కళ్లుగా భావిస్తుంది. ప్రతిష్టాత్మకంగా భావించిన కులగణన సర్వే 96 శాతం పూర్తి చేసినందుకు కలెక్టర్లకు అభినందనలు.

కలెక్టర్ల పనితీరే ప్రభుత్వం పనితీరుకు కొలమానం. ప్రతిష్టాత్మకంగా చేపట్టే కార్యక్రమాలను కలెక్టర్లే ప్రజల్లోకి తీసుకెళ్లాల్సి ఉంటుంది. కలెక్టర్లు తమ పనితీరును మరింత మెరుగుపరుచుకుని ముందుకు వెళ్లాల్సిన అవసరం ఉంది. ప్రభుత్వం పేదల కోసం పనిచేస్తుందని, గొప్పగా పనిచేస్తోందని ప్రజల్లో నమ్మకం కలిగించాలి. ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు నెలలో ఒక్కసారైనా వసతి గృహాలను సందర్శించి అక్కడే బస చేయాలి. ప్రజా సమస్యలు తెలుసుకోవడంలో కలెక్టర్లు క్షేత్రస్థాయిలో పర్యటించాలని గతంలో ఆదేశాలిచ్చాం. కొంతమంది ఇంకా ఆఫీసులకే పరిమితమవుతున్నారు. జనవరి 26 తర్వాత స్వయంగా ఆకస్మిక తనిఖీలు చేస్తా. నిర్లక్ష్యం వహించిన వారి పట్ల కఠిన చర్యలు తప్పవు" అని అన్నారు. ఈ సమావేశంలో మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి గారు, శ్రీధర్ బాబు గారు, తుమ్మల నాగేశ్వరరావు గారు, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి గారు, కొండా సురేఖ గారు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి గారు, జూపల్లి కృష్ణారావు గారు, పొన్నం ప్రభాకర్ గారు, ధనసరి సీతక్క గారు, ప్రణాళికా బోర్డు ఉపాధ్యక్షులు జి.చిన్నారెడ్డి గారు, ప్రభుత్వ సలహాదార్లు కే.కేశవరావు గారు, షబ్బీర్ అలీ గారు, హర్కర వేణుగోపాల్ గారు, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి గారు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి గారితో పాటు ఆయా శాఖల ఉన్నతాధికారులు, జిల్లాల కలెక్టర్లు పాల్గొన్నారు.




## బెనిఫిట్ షోలపై హైకోర్టు ఆగ్రహం

- గేమ్‌ఛేంజర్ టిక్కెట్ ధరల పెంపుపై సమీక్షించాలని ప్రభుత్వానికి ఆదేశం
- విచారణ 24కు వాయిదా

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

సంక్రాంతి కానుకగా జనవరి 10న 'గేమ్ ఛేంజర్' ప్రేక్షకుల ముందుకు వచ్చిన సంగతి తెలిసిందే. దిల్ రాజు నిర్మాతగా వ్యవహరిస్తున్న ఈ మూవీకి బెనిఫిట్ షోలకు అనుమతులు, టిక్కెట్ ధరల పెంపు చేయటం జరిగింది. ఈ విషయమై ఈరోజు తెలంగాణ హైకోర్టులో విచారణ జరిగింది. ఈ సందర్భంగా హైకోర్టు ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. బెనిఫిట్ షోలను రద్దు చేశామని చెప్పి... ప్రత్యేక షోలకు అనుమతి ఇవ్వడమేంటని ప్రశ్నించింది. ఇటీవల పుష్ప 2 ది రూల్ సినిమా రిలీజ్ సమయంలో తొక్కిసలాట ఘటన నేపథ్యంలో 'ఇకపై తెలంగాణలో బెనిఫిట్ షోలు ఉండవు. అదనపు షోలు ఉండవు. టిక్కెట్ ధరలు పెంచబోం' అంటూ సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారని తెలిసిందే. అయితే ఈ విషయాన్ని అసెంబ్లీలో ప్రకటించి నెల రోజులు కూడా కాకముందే ప్రభుత్వం యూటర్న్ తీసుకుంటూ.. రామ్‌చరణ్ హీరోగా 'గేమ్ ఛేంజర్' సినిమా బెనిఫిట్ షోలకు, అదనపు షోలకు, టిక్కెట్ ధరల పెంపునకు అనుమతులిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

10వ తేదీన ఉదయం 4 గంటల నుంచి బెనిఫిట్‌షోలు ప్రదర్శించేందుకు, ఆ రోజు 6 షోలు, 11వ తేదీ నుంచి 19వ తేదీ వరకు ఐదు షోలు ప్రదర్శించేందుకు అనుమతి ఇచ్చింది ప్రభుత్వం. అంతేకాదు 10న అదనంగా మల్టీప్లెక్స్‌లో రూ.150, సింగిల్ స్క్రీన్లలో రూ.100, 11-19 వరకు మల్టీప్లెక్సుల్లో రూ.100, సింగిల్ స్క్రీన్లలో రూ.50 టిక్కెట్ ధరలు పెంచుకునేందుకు ప్రభుత్వం అనుమతించింది. తాజా పరిణామాల దృష్ట్యా 'గేమ్ ఛేంజర్' స్పెషల్ షోలకు అనుమతిపై న్యాయస్థానం అసంతృప్తి వ్యక్తం చేసింది. బెనిఫిట్ షోలు రద్దు చేశామంటూ, పరోక్షంగా ప్రత్యేక షోలకు అనుమతి ఇవ్వడమేంటని ప్రశ్నించింది. అర్ధరాత్రి ఒంటి గంట దాటిన తర్వాత తెల్లవారుజామున షోలకు అనుమతి ఇవ్వడంపై పునఃసమీక్షించాలని ఆదేశించింది. ఈమేరకు హోంశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిని ఆదేశించింది. నిర్మాత భారీ బడ్జెట్‌తో సినిమాలు తీసి ప్రేక్షకుల నుంచి వసూలు చేసుకోవడం సరైంది కాదని వ్యాఖ్యానించింది. ఈ విషయంపై తదుపరి విచారణను ఈనెల 24వ తేదీకి వాయిదా వేసింది.

## గేమ్‌ఛేంజర్‌తో టంగ్ ఛేంజరైన రేవంత్‌రెడ్డి

- ఏఐ విజువల్ ఎఫెక్ట్స్ టెక్నాలజీ తెలుగు చిత్రపరిశ్రమకు ఎంతో ఉపయోగపడుతుంది
- మాజీ మంత్రి హరీశ్‌రావు




**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

రేవంత్ రెడ్డి గేమ్‌ఛేంజర్ సినిమాతో టంగ్ ఛేంజర్ అయ్యారని మాజీ మంత్రి హరీశ్‌రావు ఎద్దేవా చేశారు. హాలీవుడ్‌తో తెలుగు సినిమా పోటీ పడేందుకు విజువల్ ఎఫెక్ట్స్ ఉపయోగపడతాయని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. ఏఐ విజువల్ ఎఫెక్ట్స్ టెక్నాలజీ తెలుగు చిత్రపరిశ్రమకు ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. ప్రసాద్ ల్యాబ్స్ లో కల్ప్రా విఎఫ్ఎక్స్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. "కల్ప్రా విఎఫ్ఎక్స్ సీఈవో మల్లేశ్వర్ గారు సిద్దిపేట లాంటి పట్టణాల్లో ఐటీ కంపెనీని పెట్టి ఎంతో మంది యువతను ప్రోత్సహించారు. హాలీవుడ్ తో తెలుగు సినిమా పోటీ పడేందుకు విజువల్ ఎఫెక్ట్స్ ఉపయోగపడతాయి. ఏఐ విజువల్ ఎఫెక్ట్స్ టెక్నాలజీ తెలుగు చిత్రపరిశ్రమకు ఎంతో ఉపయోగపడుతుంది. ఆర్ఆర్ఆర్ సినిమాకు ఆస్కార్ అవార్డులు రావడం తెలుగు ప్రజలందరికీ గర్వకారణం.

తెలుగు ప్రజల గౌరవం ప్రపంచవ్యాప్తంగా పెరగాలి. మరింత మంచి చిత్రాలు విజువల్ ఎఫెక్ట్స్ లో రావాలి. కల్ప్రా విఎఫ్ఎక్స్ వారు తెలుగు పరిశ్రమలో రాణించాలని, మంచి అవకాశాలు అందుకోవాలని కోరుకుంటున్నాను. ముఖ్యమంత్రి అనాలోచిత నిర్ణయాల వల్ల ఇటీవల తొక్కిసలాటలో ఒక మహిళ చనిపోయింది. ఇంకెప్పుడూ సినిమా రేట్లు పెంచం, స్పెషల్ షోలకు పర్మిషన్ ఇవ్వం అని అసెంబ్లీ సాక్షిగా చెప్పి ఇప్పుడు మరో సినిమాకు స్పెషల్ షోలకు అనుమతిచ్చారు. నచ్చితే ఒకలాగా నచ్చకపోతే మరోలాగా వ్యవహరించడం ముఖ్యమంత్రి స్థాయికి మంచిది కాదు. అసెంబ్లీలో చెప్పిన మాటకు కూడా విలువ లేకపోతే ఎలా ముఖ్యమంత్రి గారు? అందరికి సమానంగా రూల్స్ ఉండాలి. నచ్చిన వారికి ఒకలాగా నచ్చని వారికి మరోలా ఉండకూడదు. గేమ్ చేంజర్ సినిమాకు టంగ్ చేంజర్ అయిన ముఖ్యమంత్రి. చిత్ర పరిశ్రమ లక్షల మందికి ఉపాధి కల్పించే పరిశ్రమ. తెలుగు సినిమా హైదరాబాదును ప్రపంచ పటంలో నిలబెట్టింది. కక్ష సాధింపు చర్యలకు ప్రభుత్వం పాల్పడకూడదు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో చిత్ర పరిశ్రమకు కేసీఆర్ గారు ప్రోత్సాహాన్ని ఇచ్చి అద్భుతంగా వృద్ధి చెందేలా చేశారు. హైదరాబాదులో చిత్ర పరిశ్రమ స్థిరపడడానికి కేసీఆర్ గారు కృషి చేశారు. తెలుగు చిత్ర పరిశ్రమ మరింత బలపడాలి. ప్రపంచ స్థాయిలో మంచి గుర్తింపును సాధించాలని, అందులో కల్ప్రా విఎఫ్ఎక్స్ మంచి అవకాశాలను అందుకోవాలని ఆకాంక్షిస్తూ వారికి శుభాకాంక్షలు" అని అన్నారు.

## 'మీరు పెట్టుబడులతో రండి అద్భుతాలు సృష్టిద్దాం'




- సీఎం రేవంత్‌రెడ్డి

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

తెలంగాణను అంతర్జాతీయ స్థాయిలో అభివృద్ధి చేసేలా ప్రణాళిక రూపొందించామని, హైదరాబాద్‌లో నిర్మించతలపెట్టిన ఫోర్త్ సిటీ న్యూయార్క్, లండన్, టోక్యో, సియోల్, దుబాయ్ వంటి నగరాలతో పోటీ పడేలా ఉంటుందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. గచ్చిబౌలిలో నిర్వహించిన సీఐఐ జాతీయ కౌన్సిల్ సమావేశాల్లో సీఎం ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. భారతదేశంలోనే గొప్ప నగరంగా నిర్మించాలనుకుంటున్నామని, ఇందులో సేవా రంగం మాత్రమే ఉంటుందని సీఎం తెలిపారు.

ఫ్యూచర్ సిటీ పేరుతో దేశంలోనే ఒక గొప్ప నగరాన్ని నిర్మించాలన్నది తెలంగాణ ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు చెప్పారు. న్యూయార్క్, లండన్, టోక్యో, సియోల్, దుబాయ్ లాంటి ప్రపంచ నగరాలతో పోటీ పడాలన్న ప్రభుత్వ ఆకాంక్షకు అనుగుణంగా పెట్టుబడులతో ముందుకు రావాలని పారిశ్రామిక వేత్తలకు ఆహ్వానం పలికారు. పారిశ్రామికాభివృద్ధిలో తెలంగాణ ప్రభుత్వ లక్ష్యాలను వివరించారు. తెలంగాణలో ఆర్థిక వ్యవస్థ వృద్ధి చెందడానికి, స్వేచ్ఛా వాణిజ్యం, మార్కెట్లు పనిచేయడానికి పారిశ్రామిక రంగం సహకరించాలని కోరారు. ప్రపంచంలోనే అత్యుత్తమ ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ అందించడానికి తెలంగాణ రాష్ట్రం సిద్ధంగా ఉందని చెప్పారు.

"తెలంగాణ రైజింగ్ లక్ష్యంతో సేవల రంగం కేంద్రీకృతంగా ఫోర్త్ సిటీని నిర్మించాలన్నది ప్రభుత్వ ఆకాంక్ష. హైదరాబాద్‌లో సంపూర్ణంగా నెట్ జీరో లక్ష్యాలతో పనిచేస్తున్నాం. హైదరాబాద్ నగరాన్ని కాలుష్య రహిత నగరంగా మార్చడంలో భాగంగా 3200 ఆర్టీసీ బస్సుల స్థానంలో విద్యుత్

వివరాలు 2వ పేజీలో

## ఏఎస్సైలకు పదోన్నతి

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

సంక్రాంతి పండుగ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం ఏఎస్సైలకు శుభవార్త అందించింది. 1989, 1990 బ్యాచ్ పోలీసులకు పదోన్నతి కల్పించింది. హైదరాబాద్ రీజియన్‌లోని 187 మంది ఏఎస్సైలకు ఎస్ఐలుగా పదోన్నతి కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు డీజీపీ జితేందర్ ఆదేశాల మేరకు పదోన్నతులు కల్పిస్తూ మల్టీ జోన్-2 ఐజీపీ సత్యనారాయణ ఈరోజు ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభుత్వం నిర్ణయంపై ఏఎస్ఐలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## రాష్ట్రాలకు కేంద్రం నిధులు విడుదల

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

సంక్రాంతి పండుగ సందర్భంగా కేంద్రం గుడ్ న్యూస్ వినిపించింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణతో పాటు పలు రాష్ట్రాలకు భారీగా నిధులు విడుదల చేసింది. కేంద్ర ప్రభుత్వం పన్నుల వాటా కింద మొత్తం రూ.1,73,030 కోట్లు విడుదల చేసింది. ఇందులో తెలంగాణకు రూ.3637 కోట్లు, ఏపీకి రూ.7002 కోట్లు విడుదలయ్యాయి. ఈ నిధులను మూలధన వ్యయం, అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు కేటాయించారు. కాగా, పన్నుల వసూళ్లలో కేంద్రం 41 శాతం రాష్ట్రాలకు వాటాగా విడుదల చేస్తుంది. ఈసారి విడుదలైన వాటాలో యూపీకి అత్యధికంగా రూ.31,039.84 కోట్లు కేటాయించారు. ఆ తర్వాత బీహార్‌కు రూ.17,403.36 కోట్లు, పశ్చిమ బెంగాల్‌కు రూ.13017.06 కోట్లు, మహారాష్ట్రకు రూ.10,930.31 కోట్లు, రాజస్థాన్‌కు రూ.10,426.78 కోట్లు కేటాయించారు. ఈ రాష్ట్రాల తర్వాత తమిళనాడుకు రూ.7057.89 కోట్లు విడుల చేసింది కేంద్రం. ఆ తర్వాత ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి రూ.7002 కోట్లు, తెలంగాణకు రూ.3,637 కోట్లు కేటాయించారు. అత్యల్పంగా గోవాకు రూ.667.91 కోట్లు, సిక్కింకు రూ.671.35 కోట్లు వచ్చాయి.

## హరిత హొటల్‌లో ప్రేమజంట ఆత్మహత్య

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

సింగూరు ప్రాజెక్టు వద్ద విషాదం నెలకొంది. ఓ ప్రేమజంట ఆత్మహత్యకు పాల్పడింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని ప్రేమికుల మృతదేహాలను స్వాధీనం చేసుకున్నారు. మునిపల్లి మండలం బుసారెడ్డిపల్లి వద్ద హరిత రెస్టారెంట్‌లో నిన్న మధ్యాహ్నం ఓ ఇద్దరు ప్రేమికులు ఓ గదిని అద్దెకు తీసుకున్నారు. అయితే శనివారం మధ్యాహ్నం వరకు కూడా గది తెరవకపోవడంతో.. రెస్టారెంట్ సిబ్బంది అప్రమత్తమైంది. పోలీసుల సమక్షంలో ఆ గది తలుపులు తెరిచి చూడగా ప్రేమికులిద్దరూ ఉరేసుకున్న దృశ్యం కనిపించింది. డెడ్‌బాడీలను పోలీసులు కిందకు దించి.. పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వం ఆస్పత్రికి తరలించారు. ప్రేమికులను నారాయణఖేడ్ పరిధిలోని నిజాంపేట్ వాసులుగా పోలీసులు గుర్తించారు. మృతులను ఉదయ్‌కుమార్(21), మౌనిక(19)గా పోలీసులు నిర్ధారించారు. ఇరు కుటుంబాల పెద్దలు వీరి ప్రేమ పెళ్లికి అంగీకరించకపోవడంతోనే సూసైడ్ చేసుకున్నట్లు పోలీసుల ప్రాథమిక విచారణలో తేలింది. మృతుల కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు.

## 28 వరకు హరీశ్‌రావును అరెస్ట్ చేయొద్దు

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

పంజాగుట్ట పోలీసులు తనపై దాఖలు చేసిన ఎఫ్ఐఆర్‌ను కొట్టివేయాలని, అరెస్ట్ చేయకుండా ఆదేశాలు ఇవ్వాలని హైకోర్టులో మాజీ మంత్రి హరీశ్‌రావు పిటిషన్ దాఖలు కేసులో ఇప్పటికే హరీష్ రావును అరెస్ట్ చేయొద్దని గతంలోనే హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. తాజాగా శుక్రవారం ఈ పిటిషన్‌పై హైకోర్టు మరోసారి విచారణ చేపట్టింది. కౌంటర్ దాఖలు చేయాలని చక్రధర్ గౌడ్ కు ఆదేశాలు జారీ చేసింది. అనంతరం విచారణను ఈనెల 28వ తేదీకి వాయిదా వేసింది. అప్పటివరకు హరీష్ రావును అరెస్ట్ చేయొద్దనే ఉత్తర్వులను పొడిగించింది. ఇదిలా ఉండగా గత అసెంబ్లీ ఎన్నికల్లో హరీశ్‌రావుపై సిద్దిపేట నుంచి చక్రధర్ గౌడ్ పోటీ చేశారు. సిద్దిపేట నియోజకవర్గంలో తాను పలు సేవా కార్యక్రమాలు చేశానని, హరీశ్‌రావు తనపై

వివరాలు 2వ పేజీలో

## మూడు నెలల్లో ఉప్పల్ ఆర్వోబీ

- 2027 నాటికి కొత్తపల్లి-మనోహరాబాద్ రైల్వే లైన్ పూర్తి
- మార్చి నాటికి ఆధునాతనంగా కరీంనగర్ రైల్వే స్టేషన్
- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్



**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

తెలంగాణలో చేపట్టిన రైల్వే లైన్ పనుల్లో జాప్యం కావడానికి భూసేకరణ సమస్యే కారణమని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. శుక్రవారం కరీంనగర్ రైల్వే స్టేషన్ తో పాటు కొత్తపల్లి రైల్వే స్టేషన్ ఆధునికీకరణ పనులను ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ%% ఆశించిన స్థాయిలో రాష్ట్ర ప్రభుత్వం సహకరించడం లేదన్నారు. కేంద్రం ఎప్పటికప్పుడు నిధులు మంజూరు చేస్తున్నా భూసేకరణ సమస్య పరిష్కారం కాకపోవడంతో చాలా చోట్ల రైల్వే లైన్, ఆర్వోబీల నిర్మాణ పనుల్లో జాప్యం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.

కొత్తపల్లి-మనోహరాబాద్ రైల్వే నిర్మాణ పనులను 2027నాటికి పూర్తవుతాయని బండి సంజయ్ అన్నారు. వచ్చే మార్చి నాటికి కరీంనగర్ రైల్వే స్టేషన్ ఆధునికీకరణ పనులు పూర్తవుతాయని, రూ.60కోట్లతో చేపట్టిన కొత్తపల్లి రైల్వే స్టేషన్ పనులు వేగంగా కొనసాగుతున్నాయని చెప్పారు. జమ్మికుంట-ఉప్పల్ ఆర్వోబీ నిర్మాణం కూడా అనేక కారణాలవల్ల జాప్యం జరిగిందని చెప్పారు. రానున్న మూడు నెలల్లో ఉప్పల్ ఆర్వోబీ పనులను పూర్తి చేస్తామని అధికారులు హామీ ఇచ్చారన్నారు.

అమృత్ భారత్ పథకంలో భాగంగా తెలంగాణలో 40 స్టేషన్లను అభివృద్ధి చేస్తున్నామని, ఆ జాబితాలో కరీంనగర్ రైల్వే స్టేషన్ ఎంపికైందని మంత్రి సంజయ్ అన్నారు. సేతు బంధన్ స్కీం కింద రూ.154 కోట్లతో చేపట్టిన కరీంనగర్ ఆర్వోబీ పనులను పరిశీలించాలని, పూర్తిగా కేంద్ర నిధులతోనే ఆర్వోబీని నిర్మిస్తున్నామన్నారు. గత ప్రభుత్వం సహకరించకపోవడం వల్ల నిర్మాణం ఆలస్యమైందని అన్నారు. ఉమ్మడి కరీంనగర్, ఉమ్మడి మెదక్ జిల్లాల ప్రజల చిరకాల స్వప్నమైన కొత్తపల్లి-మనోహరాబాద్ రైల్వే లేన్ నిర్మాణ పనుల పురోగతిపై అధికారులతో సమీక్షించామన్నారు.



## అధికారికంగా కొమురం భీం జయంతి, వర్ధంతి

**ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి**

**ఆదివాసీ సంఘాలు, నాయకులతో సమావేశం**

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

సంక్రాంతి పండుగ వేళ ఆదివాసీలపై తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి వరాల జల్లు కురిపించారు. శుక్రవారం రోజున ఆదివాసీ సంఘాలు, ప్రజాప్రతినిధులతో సమావేశమైన సీఎం రేవంత్ రెడ్డి.. అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు. ఆదివాసీ ప్రాంతాల్లో రోడ్లు, నీటి సరఫరా లాంటి మౌలిక సదుపాయాలతో పాటు.. విద్య, ఉద్యోగ, ఆర్థిక అభివృద్ధికి అన్నిరకాల చర్యలు తీసుకుంటున్నామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ఈ క్రమంలోనే.. ఆదివాసీలపై కొన్ని వరాలు కూడా కురిపించారు.

తమకున్న సమస్యలను ఆదివాసీ సంఘాల నేతలు రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఆదివాసీల విద్య, ఉద్యోగ అవకాశాలు, ఆర్థిక అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలంటూ సీఎంను ఆదివాసీ సంఘాలు కోరాయి. ఆదివాసీ ప్రాంతాల్లో రోడ్డు రవాణా, సాగు, తాగునీటి సరఫరా లాంటి మౌలిక సౌకర్యాలను మెరుగుపర్చాలని విజ్ఞప్తి చేశారు.ఆదివాసీ సంఘాలు చేసిన విజ్ఞప్తిపై స్పందించిన సీఎం రేవంత్ రెడ్డి.. తాను పీసీసీ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత మొట్టమొదటి సభ ఇంద్రవెల్లిలోనే పెట్టినట్లు గుర్తుచేశారు. ఇంద్రవెల్లి అమరుల స్తూపాన్ని స్మృతి వనంగా మార్చాలని, అమరుల కుటుంబాలకు ఇండ్లు మంజూరు చేయాలని నిర్ణయించామని.. అధికారంలోకి వచ్చిన వెంటనే వాటిని పూర్తి చేసుకున్నామని తెలిపారు. రాజకీయంగానూ ఆదివాసీలకు న్యాయం చేస్తూ ముందుకు వెళ్తున్నట్లు వివరించారు.

ఆదివాసీలు విద్య, ఉద్యోగ, ఆర్థిక అభివృద్ధికి ప్రభుత్వం అన్ని రకాల చర్యలు చేపడుతున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. కొమురం భీం వర్ధంతి, జయంతులను అధికారికంగా నిర్వహించాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. ఆదివాసీల కోసం ప్రత్యేకంగా స్టడీ సర్కిల్, మౌలిక సదుపాయాలను వెంటనే మంజూరు చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఆదివాసీల మాతృ భాషలో విద్యను అందించే అంశాన్ని అధ్యయనం చేయాలని అధికారులకు సూచించారు. గోండు భాషలో ప్రాథమిక విద్యను అందించే అంశంపై అధ్యయనం చేసి రిపోర్ట్ అందించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

విదేశాల్లో చదువుకునే ఆదివాసీ విద్యార్థులకు సంబంధించి పెండింగ్ ఓవర్సీస్

వివరాలు 2వ పేజీలో

# ‘నేనూ మనిషినే తప్పులు జరుగుతాయ్’

- ప్రధాని మోడీ
- ప్రధాని తొలి పాడ్‌కాస్ట్
- ఇంటర్వ్యూ చేసిన జిరోదా సహ వ్యవస్థాపకుడు నిఖిల్ కామత్



బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

ప్రధాని నరేంద్ర మోడీ మొదటిసారి ఓ పాడ్‌కాస్ట్ ఇంటర్వ్యూలో పాల్గొన్నారు. ప్రముఖ వ్యాపారవేత్త, జిరోదా సహ వ్యవస్థాపకుడు నిఖిల్ కామత్ నిర్వహిస్తోన్న పాడ్‌కాస్ట్‌లో అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ, కామత్ పలు ఆసక్తికర విషయాలను షేర్ చేసుకున్నారు. ఈ పాడ్ కాస్ట్ కు సంబంధించిన ట్రైలర్ వీడియోను నిఖిల్ తన ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేశారు. దీన్ని మోదీ రీపోస్ట్ చేశారు. అందులో ప్రధాని మోదీ గతంలో చేసిన వ్యాఖ్యలను వీరు గుర్తుచేసుకున్నారు. ఈ క్రమంలో తానూ ఒక మనిషి నేనని, పొరపాట్లు జరుగుతాయని మోదీ చెప్పారు.దాదాపు రెండు నిమిషాలు ఉన్న ఈవీడియోలో రాజకీయాలు, వ్యవస్థాపకత, నాయకత్వ సవాళ్ల వంటి పలు అంశాలపై ఇద్దరూ చర్చించారు. పాడ్‌కాస్ట్ ప్రారంభంలో నిఖిల్ కామత్ మాట్లాడారు. ‘ప్రధానిని ఇంటర్వ్యూ చేస్తున్నానంటే ఒకింత భయంగా ఉంది’ అని అన్నారు. దీనికి మోదీ బదులిస్తూ ‘ఇదే నా ఫస్ట్? పాడ్‌కాస్ట్. దీన్ని ప్రజలు ఎలా స్వీకరిస్తారో తెలియదు మరి’ అనడం వల్ల నవ్వులు పూశాయి.

కాగా, రాజకీయాల్లోకి రావాలనుకునే యువతకు మీరిచ్చే సూచన ఏంటి? అని నిఖిల్ కామత్ ప్రధానిని అడగారు. దానికి మోదీ బదులిచ్చారు. “రాజనీతి కలిగిన వ్యక్తులు రాజకీయాల్లోకి రావాల్సిన అవసరం ఉంది. ప్రజాసేవ చేయాలన్న మిషన్ తీసుకోవడం కోసం రావాలి. కానీ సొంత లక్ష్యాలు నెరవేర్చుకోవడం కోసం కాదు” అని అన్నారు. ఈ సందర్భంగా మోదీ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో చేసిన పాత స్పీచ్?ల గురించి మాట్లాడారు. అప్పుడు తానే ఏదో అని ఉంటానని, పొరపాట్లు జరుగుతుంటాయన్నారు. తానూ మనిషినేనని భగవంతుడిని కాదు కదా అంటూ వ్యాఖ్యానించారు.

తొలి రెండు సార్లు ప్రధానిగా తన అనుభవాలను మోదీ షేర్ చేసుకున్నారు. ఈ పాడ్‌కాస్ట్ వీడియోను ప్రధాని రీపోస్ట్ చేశి. ‘ఈ ఇంటర్వ్యూను మీరంతా ఎంజాయ్ చేస్తారని ఆశిస్తున్నా’ అని క్యాప్షన్ జోడించారు. అయితే ప్రస్తుతం ఈ పాడ్‌కాస్ట్ ఇంటర్వ్యూ ట్రైలర్ వచ్చింది. పూర్తి విడియో ఎప్పుడొస్తుందన్న దానిపై క్లారిటీ లేదు.



# కేసీఆర్‌తో కేటీఆర్ భేటీ

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

ఫార్ములా– ఈ కార్ రేస్ కేసు నేపథ్యంలో మాజీ ముఖ్యమంత్రి, బిఆర్ఎస్ అధినేత కెసిఆర్‌ను ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ భేటీ అయ్యారు. సిద్ధిపేట జిల్లా ఎర్రవల్లి వ్యవసాయ క్షేత్రంలో శుక్రవారం కెటిఆర్‌తోపాటు మాజీ మంత్రి హరీష్‌రావు, బీఆర్ఎస్ నేతలు బాల్క సుమన్, పాడి కౌశిక్ రెడ్డిలు కెసిఆర్‌తో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా గురువారం జరిగిన ఎసిబి విచారణకు సంబంధించిన పలు అంశాలను కెసిఆర్ దృష్టికి తీసుకెళ్లినట్టు సమాచారం. ఎసిబి విచారణలో అధికారులు అడిగిన ప్రశ్నలు, తాను చెప్పిన సమాధానాలను వివరించారు. అలాగే ఈనెల 16వ తేదీన ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్(ఇడి) విచారణకు హాజరుకావాల్సి ఉందని కెసిఆర్‌కు కెటిఆర్ తెలిపారు. దీంతో ఈనెల 16న ఇడి విచారణను ఎలా ఎదుర్కోవాలనే అంశంపై కెటిఆర్‌కు అధినేత దిశానిర్దేశం చేశారు. దాదాపు గంటన్నరపాటు జరిగిన సమావేశంలో తెలంగాణ తాజా రాజకీయ పరిణామాలు, కేసులతోపాటు పార్టీ పరంగా తీసుకోవాల్సిన అంశాలపైనా నేతలకు కెసిఆర్ సూచనలు చేశారు.

**1 ప్లస్ 6 ఆఫర్ సీఎం వ్యవస్థను ఎప్పుడూ చూడలేదెమో : కెటిఆర్ సెటైర్లు**

తెలంగాణలో ఒక ముఖ్యమంత్రిని ఎన్నుకుంటే.. ఇంకో అర డజన్ మంది ఫ్రీగా వచ్చారని, ఇది తెలంగాణ రాష్ట్ర ప్రజల అదృష్టం అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ పేర్కొన్నారు. 1 ప్లస్ 6 ఆఫర్ సీఎం వ్యవస్థని స్వతంత్ర భారత చరిత్రలో ఎప్పడు చూడలేదెమో అని కెటిఆర్ ఎక్స్ వేదికగా సెటైర్లు వేశారు. వికారాబాద్ సిఎం తిరుపతి రెడ్డికి ఇవే నా హృదయపూర్వక శుభాకాంక్షలు అని విమర్శించారు. ప్రజా పాలన కాబట్టి ప్రజలకి మీ అనుముల సిఎంలలో ఎవరు కావాలో ఎంచుకునే అవకాశం ఇవ్వాలని కోరుకుంటునని అన్నారు. సిఎం ఎంపిక కోసం ఐవీఆర్ఎస్ పద్ధతి పెడితే బాగుంటుందేమో చూడండి అని రేవంత్ రెడ్డికి ఒక చిన్న విన్నపం చేస్తున్నట్లు కెటిఆర్ సూచించారు.

# ‘మీరు పెట్టుబడులతో రండి అద్భుతాలు సృష్టిద్దాం’

(మొదటి పేజీ తరువాయి)

వాహనాలను సమకూర్చబోతున్నాం. ఎలక్ట్రిక్ వాహనాలపై రిజిస్ట్రేషన్, రోడ్ టాక్స్‌లను పూర్తిగా రద్దు చేశాం. ప్రస్తుతం ఎలక్టిక్ వాహనాల అమ్మకాలు అత్యంత వేగంగా పెరుగుతున్నాయి. వరదలు లేని నగరంగా, దేశంలోనే పర్యావరణ హితమైన హైదరాబాద్‌ను తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో చర్యలు చేపట్టాం. అందులో భాగంగా 55 కిలోమీటర్ల పొడవైన మూసీ పునరుజ్జీవ పనులను ప్రారంభించాం. 2050 నాటికి అవసరమయ్యే తాగునీటి అవసరాలకు అవసరమైన కార్యాచరణను ఇప్పటి నుంచే ప్రారంభించాం. తెలంగాణ మణిహారంగా రీజినల్ రింగ్ రోడ్డు నిర్మాణం చేపట్టాం. అవుటర్ రింగ్ రోడ్డుకు రీజినల్ రింగ్ రోడ్డుకు మధ్యన రేడియల్ రోడ్లను నిర్మించబోతున్నాం. ఆయా ప్రాంతాల్లో ఫార్మా, లైఫ్ సైన్సెస్, ఏరోస్పేస్, డిఫెన్స్, ఈవీ, సోలార్ పవర్ వంటి పరిశ్రమలు అక్కడ ఏర్పాటు చేయబోతున్నాం.

360 కి.మీ పొడవు ఉండబోయే రీజినల్ రింగ్ రోడ్డు వెంట రీజినల్ రింగ్ రైల్‌ను నిర్మించాలని ప్రధానమంత్రి గారిని కోరాం. రీజినల్ రింగ్ రోడ్ చుట్టూ తయారీ పరిశ్రమ, మార్కెటింగ్ కు అవసరమైన కేంద్రీకృత ప్రదేశాలను ఏర్పాటు చేయాలన్నది మా ఉద్దేశం.చైనా తరహాలో రకరకాల క్లస్టర్లను సృష్టించాలని భావిస్తున్నాం. ఒక లైట్ సిటీ, మార్బుల్ సిటీ, గ్రానైట్ సిటీ, ఫర్నీచర్ సిటీ... ఇలా ప్రత్యేక తరహాలో రీజినల్ రింగ్ రోడ్డు చూట్టూ మార్కెటింగ్ కార్యకలాపాల విస్తరణకు ప్రయత్నిస్తున్నాం.

రీజినల్ రింగ్ రోడ్ పూర్తయితే తెలంగాణ ప్రాంతంలో 70 శాతం పట్టణీకరణ జరుగుతుంది. రింగ్ రోడ్డు ఆవలివైపున గ్రామీణ తెలంగాణ సమగ్రాభివృద్ధి లక్ష్యంగా వ్యవసాయం, సేంద్రీయ సాగు, రైతుల కోసం గిడ్డంగులు, కోల్డ్ స్టోరేజీల ఏర్పాటుపై ప్రభుత్వం దృష్టి సారించింది. తెలంగాణకు సముద్ర తీరప్రాంతం లేని కారణంగా డ్రై పోర్టును ఏర్పాటు చేస్తున్నాం. పోర్టుతో అనుసంధానం చేయడానికి మచిలీపట్నం ఓడరేవు వరకు ప్రత్యేక రహదారి, రైల్వే కనెక్టివిటీని ప్రతిపాదించాం.

నైపుణ్యత పెంచడానికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలను మెరుగుపరచడంపై ప్రధానంగా దృష్టి సారించాం. చైనా ప్లస్ వన్ వ్యూహంలో హైదరాబాద్‌ను ప్రపంచంలో ప్రధాన పెట్టుబడుల కేంద్రంగా ఉండేలా చర్యలు తీసుకుంటున్నాం.

సీఐఐ జాతీయ కౌన్సిల్ సమావేశాన్ని హైదరాబాద్‌లో నిర్వహించడం శుభ పరిణామం. అత్యుత్తమ వ్యాపార సౌలభ్యాలను అందించడానికి తెలంగాణ సిద్ధంగా ఉంది. సీఐఐ కలిసిరావాలి. అందరం కలిసి అద్భుతాలు సాధించవచ్చని మా నమ్మకం” అని ముఖ్యమంత్రి గారు రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యాలను వివరించారు. ఈ సమావేశంలో సీఐఐ అధ్యక్షుడు సంజీవ్ పూరి గారు, వైఎస్–ప్రెసిడెంట్ ఆర్. ముకుందన్ గారు, సీఐఐ డైరెక్టర్ చంద్రజీత్ బెనర్జీ గారు, పరిశ్రమల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్ గారితో పాటు సీఐఐ ప్రతినిధులు, ఆయా కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

# పరువు నష్టం కేసులో రాహుల్ గాంధీకి బెయిల్

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

పరువు నష్టం కేసులో కాంగ్రెస్ అగ్రనేత, లోక్ సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీకి పుణే కోర్టులో ఊరట లభించింది. ఈ కేసులో ఆయనకు బెయిల్ మంజూరు చేసింది. 2023 మార్చిలో లండన్‌లో వీరసావర్కర్‌ను ఉద్దేశించి ఆయన చేసిన వ్యాఖ్యల మీద సావర్కర్ మనవడు సత్యకి సావర్కర్ పుణేలోని కోర్టులో పరువు నష్టం కేసు వేశారు. ఈ కేసుకు సంబంధించి రాహుల్ గాంధీ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా విచారణకు హాజరయ్యారు. ఆయనకు రూ.25 వేల పూచీకత్తు బాండ్‌పై ఎంపీ–ఎమ్మెల్యే కోర్టు బెయిల్ మంజూరు చేసింది. రాహుల్ గాంధీకి పూచీకత్తుగా కాంగ్రెస్ సీనియర్ నేత మోహన్ కోర్టుకు హాజరయ్యారు.

# అధికారికంగా కొమురం భీం జయంతి, వర్ధంతి

(మొదటి పేజీ తరువాయి)

స్కాలర్ షిప్స్‌ను వెంటనే క్లియర్ చేయాలని రేవంత్ రెడ్డి ఆదేశించారు.

స్పెషల్ డ్రైవ్ కింద ఇందిర జలప్రభ ద్వారా ఉచితంగా బోర్లు వేసేందుకు చర్యలు చేపట్టాలని తెలిపారు. ఆదివాసీ రైతుల వ్యవసాయ బోర్లకు సోలార్ పంపుసెట్లు ఉచితంగా అందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఆదివాసీ గూడాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అధికారులు రేవంత్ రెడ్డి ఆదేశించారు. మంజూరైన బీఈడీ కళాశాలకు టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టుల భర్తీకి చర్యలు తీసుకోవాలని అధికారులను రేవంత్ రెడ్డి తెలిపారు. ఆదివాసీ గూడాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా, రాయి సెంటర్లకు భవనాలు నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. కేస్లాపూర్ జాతరకు నిధులు మంజూరు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఉద్యమాల్లో ఆదివాసీలపై పెట్టిన కేసులు తొలగించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఐటీడీఏ ప్రాంతాలకు ప్రత్యేక కోటాలో ఇందిరమ్మ ఇండ్ల కేటాయింపునకు చర్యలు తీసుకోవాలని.. అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి కీలక ఆదేశాలు ఇచ్చారు.

# 28 వరకు హరీష్‌రావును అరెస్ట్ చేయొద్దు

(మొదటి పేజీ తరువాయి)

కక్షగట్టి క్రిమినల్ కేసుల్లో ఇరికించారని, తన ఫోన్ ట్యాపింగ్ చేయించారని చక్రధర్ గౌడ్ పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసును కొట్టివేయాలని హరీశ్‌రావు హైకోర్టులో క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు. హరీశ్‌రావును అరెస్ట్ చేయొద్దని హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది.

# బీఎల్‌ఎన్ రెడ్డిని విచారించిన ఏసీబీ

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో సంచలనం రేపిన ఫార్ములా–ఈ కార్ రేసింగ్ కేసులో విదేశీ కంపెనీకి హెచ్ఎండీఏ తరపున నిధులను ఉన్నతాధికారుల ఆదేశం మేరకే బదిలీ చేశానని హెచ్ఎండీఏ మాజీ చీఫ్ ఇంజినీర్ బీఎల్ఎన్ రెడ్డి వెల్లడించారని తెలిసింది. ఫార్ములా–ఈ కార్ రేసింగ్ కేసులో మూడో నిందితుడైన బీఎల్ఎన్ రెడ్డిని ఏసీబీ అధికారులు దాదాపు ఆరున్నర గంటల పాటు విచారించారు. ఐఓబీ బ్యాంకు ఖాతా ద్వారా ఈ డబ్బులను ఎఫ్ఈఓ కంపెనీకి బదిలీ చేసినట్టు అంగీకరించారు. అయితే, ఒక ఉన్నతాధికారిగా రూ.55 కోట్లను విదేశీ సంస్థకు బదిలీ చేసే సమయంలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) నుంచి అనుమతి తీసుకోవాలని తెలియదా? అనే ప్రశ్నకు ఆయన సమాధానమివ్వలేదని తెలిసింది. దీని ఫలితంగా రూ.8 కోట్ల మేరకు రాష్ట్ర ప్రభుత్వానికి జరిమానాను ఆర్బీఐ విధించింది కదా అన్న ప్రశ్నకు కూడా.. తాను ఉన్నతాధికారుల అనుమతి మేరకే చేశానని బీఎల్ఎన్ రెడ్డి సమాధానమిచ్చినట్టు సమాచారం.

ఫార్ములా–ఈ కార్ రేసింగ్ నిర్వహణలో తాను నిర్వహించిన పాత్ర పూర్తిగా ఉన్నతాధికారుల సూచనతోనేనని ఆయన మరో ప్రశ్నకు సమాధాన మిచ్చినట్టు తెలిసింది. విదేశీ కంపెనీకి డబ్బులు బదలాయించే విషయమై అప్పటి మంత్రి కేటీఆర్ మీకు ఆదేశాలిచ్చారా? లేక అప్పటి హెచ్ఎండీఏ కార్యదర్శి అరవింద్‌కుమార్ ఆదేశాల మేరకు చేశారా? అని ఏసీబీ ప్రశ్నించగా.. తాను పైవారి మాట మేరకే చేశానని చెప్పినట్టు సమాచారం. ఈయన విచారణలో సైతం ఫార్ములా–ఈ కార్ రేసింగ్‌కు సంబంధించి కొన్ని కీలకాంశాలను ఏసీబీ అధికారులు రికార్డు చేసినట్టు సమాచారం. అవసరమైతే మరోసారి విచారణకు పిలుస్తామని బీఎల్ఎన్ రెడ్డికి అధికారులు చెప్పారు.

# ఎమ్మెల్సీ స్థానాలకు అభ్యర్థులను ప్రకటించిన బీజేపీ

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ శాసన మండలి ఎన్నికలకు బీజేబీ సిద్ధమైంది. రాష్ట్రంలో మూడు ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికలు జరగనుండగా, అందులో రెండు ఉపాధ్యాయ ఎమ్మెల్సీలు, ఒక పట్టభద్రుల ఎమ్మెల్సీకి ఎన్నిక జరగనుంది. కాగా, తాజాగా శాసన మండలి స్థానాలకు బీజేపీ అభ్యర్థులను ప్రకటించింది. దీనికి సంబంధించి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి శుక్రవారం (జనవరి 10) ఎమ్మెల్సీ అభ్యర్థుల పేర్లను విడుదల చేశారు. నల్గొండ– ఖమ్మం– వరంగల్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా సరోత్తం రెడ్డి, కరీంనగర్– నిజామాబాద్ – ఆదిలాబాద్ – మెదక్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా మల్కా కొమరయ్యఎ కరీంనగర్– నిజామాబాద్ – ఆదిలాబాద్ – మెదక్ పట్టభద్రుల అభ్యర్థిగా అంజి రెడ్డి.

బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా ఆదేశాల మేరకు శాసన మండలి అభ్యర్థులను ప్రకటించినట్లు రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి వెల్లడించారు. కాగా.. నల్గొండ, ఖమ్మం, వరంగల్ జిల్లాల స్థాయి ఉపాధ్యాయ నియోజకవర్గం ఎమ్మెల్సీల కరీంనగర్, మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ పదవీకాలం ఈ ఏడాది మార్చి 29వ తేదీతో ముగియనుంది. దీంతో ఆయా స్థానాల్లో ఎన్నికల కోసం ఇప్పటికే ఓటరు నమోదు ప్రక్రియ ప్రారంభమైంది. ఈ ఎన్నికలకు సంబంధించి ఫిబ్రవరిలో ఎన్నికల షెడ్యూల్ విడుదలయ్యే అవకాశం ఉండనుందని అంచనాలు వేస్తున్నారు.

# స్కాన్ చేయండి పోలీస్ సేవలపై ప్రజా అభిప్రాయం తెలపండి..



● ఎస్పీ అఖిల్ మహాజన్.

**బలగం టీవీ , రాజన్న సిరిసిల్ల**

పోలీసుల గురించి ప్రజల నుండి వారి అభిప్రాయాలను సేకరించడం కోసం ఏర్పాటు చేయడం జరిగిందని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు.తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా క్యూఆర్ కోడ్ పద్ధతిని డిజిపి వీడియో కాన్ఫిరెన్స్ ద్వారా ప్రారంభించగా,జిల్లా పోలీస్ కార్యాలయంలో క్యూఆర్ కోడ్ పోస్టర్ ని ఎస్పీ అఖిల్ మహాజన్ అధికారులతో కలసి ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఎస్పి అఖిల్ మహాజన్ మాట్లాడుతూ ఈ క్యూఆర్ కోడ్ ద్వారా పిటిషన్, ఎఫ్ఐఆర్, ఇ-చలాన్ మరియు పాస్‌పోర్ట్ ధృవీకరణ మరియు పోలీస్ స్టేషన్ కి వెళ్ళినప్పుడు పోలీసు అధికారుల, సిబ్బంది ప్రతిస్పందన మరియు ప్రవర్తనపై ప్రజల ,బాధితుల అభిప్రాయం నమోదు చేయబడు తుందని అన్నారు.జిల్లా పోలీస్ కార్యాలయంతో పాటు సబ్ డివిజన్ కార్యాలయల్లో, సర్కిల్ కార్యాలయల్లో,అన్ని పోలీస్ స్టేషన్లలో అందుబాటులో వుండే విధంగా క్యూఆర్ కోడ్ ఆఫ్ సిటిజెన్ పోస్టర్ ఏర్పాటు చేయడం జరుగుతుందని ,దీనిని ప్రజలు సద్వినియోగం చేసుకోని పోలీస్ సేవలపై సలహాలు సూచనలు ఇవ్వాలని సూచించారు.

పోస్టర్ నందు గల క్యూఆర్‌కోడ్ లేదా https://qr.me-qr.com/aZMTxHDm లింక్ ద్వారా ఓపెన్ చేసి అందులో చూపిన విధంగా సలహాలు సూచనలు ఇవ్వాలని తెలిపారు.



# పార్లమెంట్లో బీసీ బిల్లు పెట్టండి..

● కేంద్రమంత్రికి వినతి పత్రం సమర్పించిన బీసీ సంక్షేమ సంఘం నాయకులు..

**బలగం టీవీ , సిరిసిల్ల**

పార్లమెంట్లో బీసీ బిల్లు ప్రవేశపెట్టాలని కరీంనగర్ లో కేంద్రమంత్రి బండి సంజయ్ కి బీసీ సంక్షేమ సంఘం నాయకులు శుక్రవారం వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాజన్న సిరిసిల్లా జిల్లా అధ్యక్షుడు మ్యాకల పర్శరాములు మాట్లాడుతూ రానున్న పార్లమెంట్ సభల్లో బీసీలకు బిల్లు పెట్టించి. బీసీలకు విద్య, ఉద్యోగాల్లో,చట్టసభల్లో 50 శాతం రాజకీయంగా రిజర్వేషన్ వచ్చేలాగా పార్లమెంట్ లో బీసీ గొంతు వినిపించాలని కోరారు.కేంద్ర మంత్రి బండి సంజయ్ కచ్చితంగా మాట్లాడి తనవంతు కృషి చేస్తానని మాట ఇవ్వడంజరిగింద ని అన్నారు . ఈ కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి కోరుట్ల రమేష్, జిల్లా కార్యదర్శులు ఎడ్ల నరేందర్, సిలువేణి మల్లేశం, వేములవాడ అర్బన్ మండల అధ్యక్షులు తీగల శ్రీనివాస్ గౌడ్, జిల్లా కార్యవర్గ సభ్యులు మారావేణి మహేష్, వేములవాడ అర్బన్ సోషల్ మీడియా కోఆర్డినేటర్ గడ్డం నరేష్ తదితర బీసీ నాయకులు పాల్గొన్నారు..

# తెలంగాణ ఉద్యమకారుల ఫోరం సిరిసిల్ల నియోజకవర్గ కన్వీనర్ గా వెంగళ శ్రీనివాస్

**బలగం టీవీ, సిరిసిల్ల**



తెలంగాణ ఉద్యమకారుల ఫోరమ్ సిరిసిల్లా నియోజవర్గ కన్వీనర్ గా వెంగళ శ్రీనివాస్ నియమింపబడ్డారు.ఈ సందర్భంగా వెంగళ శ్రీనివాస్ మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో అనేక పోరాటాలు చేసి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకోవడం జరిగిందన్నారు. సాధించుకున్న తెలంగాణలో ఆనాటి ఉద్యమకారులు కనుమరుగైపోయారని అన్నారు. ఉద్యమకారులను పట్టించుకున్న నాథుడే కరువయ్యారు. అనేక హామీలు ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ ఉద్యమకారులకు అండగా ఉంటామని 250 గజాల స్థలాన్ని కేటాయిస్తామని మేనిఫెస్టోలో ప్రకటించిన ప్రకారం, ఉద్యమకారులకు 250 గజాలు స్థలం తో పాటుగా, అర్హులకు 25 వేల పెన్షన్ ఇచ్చి ఆర్థికంగా ఆదుకోవాలని అన్నారు. ఉద్యమకారులందరినీ ఐక్యపరిచి వారి హక్కుల్ని సాధించేదాక పోరాటం సాగుతుందని ఈ సందర్భంగా అన్నారు.ఈ నా నియమాకానికి సహకరించిన తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర చైర్మన్ చీమ శ్రీనివాసరావు గారికి, జిల్లా అధ్యక్షులు బొజ్జ కనకయ్య గారికి, టి యు ఎఫ్ రాష్ట్ర కళాకారుల సంఘం కన్వీనర్ ఎల్లే పోశెట్టి గారికీ ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలియజేశారు.



# రాజన్నను దర్శించుకున్న ప్రభుత్వ విప్..

**బలగం టీవీ , వేములవాడ**

ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకొని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్,వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ గారు శ్రీ రాజరాజేశ్వర స్వామి వారిని వేకువజామునే స్థానిక నాయకులతో కలిసి దర్శించుకున్నారు.ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలను నిర్వహించారు.అనంతరం స్వామివారి పల్లకి సేవ పెద్ద సేవలో పాల్గొని తరించారు. వైకుంఠ ముక్కోటి ఏకాదశి మహోత్సవ విశిష్టత ప్రవచన కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

# ఎన్నికల్లో రైతులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలి

**బలగం టీవీ , సిరిసిల్ల**

కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో రైతులకు ఇచ్చిన హామీ లను వెంటనే అమలు చేయాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ముశం రమేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.శుక్రవారం అమృత్యులాల్ శుక్ల కార్మిక భవనంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి ము శం రమేష్, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు గన్నారపు నర్సయ్య మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సందర్భంగా రైతుల కు అనేక వాగ్దానాలు చేయడం జరిగిందని,గత ప్రభుత్వం రైతు భరోసా కింద పదివేలు ఇస్తే మేము అధికారంలోకి వస్తే వెంటనే 15000 వేలు, కౌలు రైతులకు 12000 ఇస్తామని హామీ ఇచ్చిందని, కాంగ్రెస్ పార్టీ అధికారంలో కి వచ్చిన తర్వాత రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలం అయిందని అన్నారు.అధికారం వచ్చి సంవత్సరం పూర్తయిన కూడా రైతు భరోసా ,భూమిలేని రైతులకు ఇచ్చిన హామీ అమలు చేయలేదని అన్నారు.

ఇప్పటికే వర్షాకాలం మొదటి పంటకు రైతు భరోసా అందగా, రైతులు పెట్టుబడి లేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని,ఇప్పుడు రెండో పంటైన వేసంగి కైనా రైతు భరోసా అందుతుందని రైతులు ఆశగా ఎదురుచూస్తున్నారని అన్నారు.ప్రభుత్వమేమో రైతు భరోసా విడుదల చేయడంపై కాలయాపన చేస్తుందని,ప్రభుత్వం రైతుల పట్ల అనుసరిస్తున్న విధానాల వల్ల పెట్టుబడి లేక అధిక వడ్డీలకు డబ్బులు తెచ్చుకొని పనులు కొనసాగిస్తున్నారని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే కాలయాపన చేయకుండా రైతులకు రైతు భరోసా 15000, అదేవిధంగా భూమిలేని కౌలు రైతులకు 12,000 ఎలాంటి ఎలాంటి షరతులు లేకుండా అందించాలని లేనిపక్షంలో సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో పోరాటాలు నిర్వహిస్తామని అన్నారు. ఈ సమావేశంలో సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు మల్లారం అరుణ్ కుమార్ . అన్నదాష్ గణేష్,మల్లారం ప్రశాంత్, శ్రీరాముల రమేష్ చంద్ర పాల్గొన్నారు.



# కేంద్ర మంత్రికి టీఎన్జీవోస్ డైరీ క్యాలెండర్ అందజేత..

**బలగం టీవీ, సిరిసిల్ల**

కేంద్ర మంత్రి బండి సంజయ్ కరీంనగర్ లో టీఎన్జీవోస్ నాయకులు కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపి డైరీ,క్యాలెండర్ అందచేసినారు. ఈ కార్యక్రమం లో టీఎన్జీవో అధ్యక్షుడు సమర సేన్, కోశాధికారి అహ్మద్ రసూల్, జాయింట్ సెక్రటరీలు శ్రీకాంత్, అనిల్, కార్యవర్గ సభ్యులు శేఖర్, భాగ్యలక్ష్మి, కవిత లు పాల్గొన్నారు.

# కేసీఆర్‌ను కలిసిన బీఆర్ఎస్ పార్టీ సిరిసిల్ల శాఖ అధ్యక్షులు జిందం చక్రపాణి..

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

ఎర్రవెల్లి లోని వ్యవసాయ క్షేత్రంలో తెలంగాణ తొలి ముఖ్యమంత్రివర్యులు బిఆర్ఎస్ పార్టీ జాతీయ అధ్యక్షులు కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు ని, బి ఆర్ ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు ని బిఆర్ఎస్ పార్టీ సిరిసిల్ల శాఖ అధ్యక్షులు జిందం చక్రపాణి, మర్యాదపూర్వకంగా కలుసుకొని నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది.



# ఐర్లాండ్‌పై భారత్ ఘన విజయం



**బలగం టీవీ,రాజ్‌కోట్**

ఐర్లాండ్‌తో వన్డే సిరీస్‌లో టీమ్‌ఇండియా మహిళల జట్టు శుభారంభం చేసింది. సౌరాష్ట్ర క్రికెట్ స్టేడియం వేదికగా జరిగిన ఈ మ్యాచ్‌లో భారత్ వికెట్ల తేడాతో నెగ్గింది. 239 పరుగుల ఛేదనలో టీమ్‌ఇండియా నిలకడగా రాణించింది. టీమిండియా 6 వికెట్ల తేడాతో ఐర్లాండ్‌పై విజయం సాధించింది. ఈ గెలుపుతో మూడు వన్డేల సిరీస్ 1-0తో ఆధిక్యంలో నిలిచింది.టీమిండియా ఓపెనర్ ప్రతీకా రావల్(96 బంతుల్లో 10 ఫోర్లు, సిక్స్‌తో 83), తేజల్ హసబ్నిస్(46 బంతుల్లో 9 ఫోర్లతో 53 నాటౌట్) హాఫ్ సెంచరీలతో భారత విజయంలో కీలక పాత్ర పోషించారు.

ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన ఐర్లాండ్ మహిళల జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 7 వికెట్లకు 238 పరుగులు చేసింది. ఆ జట్టు కెప్టెన్ గబీ లూయిస్(129 బంతుల్లో 15 ఫోర్లతో 92) తృటిలో సెంచరీ చేసే అవకాశాన్ని చేజార్చుకుంది. లీహ్ పాల్(73 బంతుల్లో 7 ఫోర్లతో 59) హాఫ్ సెంచరీతో రాణించాడు. భారత బౌలర్లలో ప్రియా మిశ్రా(2/56) రెండు వికెట్లు తీయగా.. టిటస్ సధు, సయలి, దీప్తి శర్మ తలో వికెట్ తీసారు.

అనంతరం భారత మహిళల జట్టు 34.3 ఓవర్లలోనే 4 వికెట్లకు 241 పరుగులు చేసి సునాయస విజయాన్నందుకుంది. కెప్టెన్ స్మృతి మంధాన(29 బంతుల్లో 6 ఫోర్లు, సిక్స్‌తో 41) శుభారంభం అందించింది. ఐర్లాండ్ బౌలర్లలో అర్లెనే కెల్లీ ఓ వికెట్ తీయగా.. మాగ్యూరీ మూడు వికెట్లు పడగొట్టింది. ఇరు జట్ల మధ్య రెండో వన్డే ఆదివారం జరగనుంది.

టీ20 ప్రపంచకప్ 2024 అనంతరం సొంతగడ్డపై న్యూజిలాండ్, వెస్టిండీస్‌తో జరిగిన వన్డే సిరీస్‌లను గెలుచుకుని జోరు మీదున్న భారత మహిళల జట్టు.. హ్యాట్రిక్ సిరీస్ విజయంపై కన్నేసింది. ఈ ఏడాది సెప్టెంబర్ నుంచి భారత్‌లో జరగాల్సి ఉన్న మహిళల వన్డే వరల్డ్‌కప్ ముందు ఈ సిరీస్‌లను టీమిండియా సన్నాహకంగా వాడుకోనుంది. ఈ సిరీస్ నుంచి రెగ్యులర్ సారథి హర్మన్‌ప్రీత్ కౌర్‌కు సెలక్టర్లు విశ్రాంతినిచ్చారు. దాంతో స్టార్ ఓపెనర్ స్మృతి మంధాన జట్టును నడిపిస్తోంది.


## స్మృతి మంధాన ఆల్‌టైమ్ రికార్డ్

**బలగం టీవీ,రాజ్‌కోట్**

భారత స్టార్ ప్లేయర్ స్మృతి మంధాన కెరీర్‌లో మరో అరుదైన ఘనత సాధించింది. వన్డే ఫార్మాట్ క్రికెట్‌లో అత్యంత వేగంగా 4000 పరుగుల మార్క్ అందుకున్న భారత తొలి మహిళా ప్లేయర్‌గా రికార్డు సృష్టించింది. మంధాన 95 ఇన్నింగ్స్?ల్లోనే ఈ ఫీట్ సాధించింది. శుక్రవారం ఐర్లాండ్ తో జరిగిన తొలి వన్డేలో 40 పరుగుల వ్యక్తిగత స్కోర్ వద్ద స్మృతి ఈ మైలురాయి అందుకుంది. కాగా, మహిళల క్రికెట్‌లో భారత్ నుంచి మంధాన ఈ ఫీట్ సాధించిన రెండో ప్లేయర్‌గా నిలిచింది. మాజీ ప్లేయర్ మిథాలీ రాజ్ (112 ఇన్నింగ్స్), మంధాన కంటే ముందు 4000 పరుగుల మార్క్ టచ్ చేసింది. ఓవరాల్‌గా వన్డేల్లో 4000ం పరుగులు సాధించిన 15వ ప్లేయర్?గా మంధాన నిలిచింది. ఇక వరల్డ్‌వైడ్‌గా అత్యంత వేగంగా ఈ మైలురాయి అందుకున్న మూడో ప్లేయర్?గా ఘనత సాధించింది.




# డాకు మహారాజ్ ఊహించిన దానికంటే మించే ఉంటుంది




**బలగం టీవీ, హైదరాబాద్**

నందమూరి బాలకృష్ణ హీరోగా బాబీ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం డాకు మహారాజ్. సితార ఎంటర్ ట్రైన్మెంట్స్ బ్యానర్ పై సూర్యదేవర నాగవంశీ ఈ సినిమాను నిర్మిస్తున్నాడు. ఇక ఈ చిత్రంలో శ్రద్ధ శ్రీనాథ్, ప్రగ్య జైస్వాల్, ఊర్వశీ రౌతేలా హీరోయిన్స్ గా నటించారు. సంక్రాంతి కానుకగా డాకు మహారాజ్ జనవరి 12 న ప్రేక్షకుల ముందుకు రానుంది. రిలీజ్ డేట్ దగ్గరపడుతుండటంతో ప్రమోషన్స్ జోరు పెంచిన మేకర్స్ శుక్రవారం ప్రీ రిలీజ్ ఈవెంట్ ను నిర్వహించారు. ఈ ఈవెంట్ లో బాలయ్య మాట్లాడుతూ .. " ఈ ఫంక్షన్ మొన్న అనంతపురం లో జరుపుకోవాల్సింది. కానీ మొన్న తిరుమలలో ఆ ఘటన జరగడంతో అప్పుడు ఆపేశాం.తిరుమల తొక్కిసలాట ఘటన నన్ను ఎంతో కలిచివేసింది. ఆ ఘటన జరగకుండా ఉండాల్సింది. మృతి చెందిన వారందరి ఆత్మలు శాంతించాలని , వారి కుటుంబ సభ్యులకు మా తరుపున , మా సిని మా తరుపున ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నాను.

అఖండ, వీరసింహారెడ్డి, భగవంత్ కేసరి సినిమాల్లో నేను పోషించిన పాత్రలు ప్రేక్షకులను అలరించాయి. ఇప్పుడు విడుదల అవుతున్న డాకు మహారాజ్ సినిమా కూడా ప్రేక్షకులకు నచ్చుతుంది. డాకు మహారాజ్ సినిమా డిస్కషన్స్ లో డైరెక్టర్ చెప్పిన దానికి నేనుకనెక్ట్ కాలేకపోయాను. ఏదో కథలా అనిపించింది. నేనెప్పుడూ ప్రేక్షకులు నా నుంచి ఏం కోరుకుంటారో అందుకు తగ్గట్టుగానే చేయాలనుకుంటాను. ఈ సినిమాలో కూడా ఆదిత్య 369 లో నేను పోషించిన కృష్ణదేవరాయ పాత్ర ప్రేక్షకులను ఎలా మెప్పించిందో.. అలాంటి పాత్ర పెట్టాలని అనుకున్నాం. నా సినిమాలో ఒక్కో సమస్యను చూపిస్తాను. ఏదో ఒక సందేశం ఇవ్వాలనుకుంటాను. ఇక ఇందులో తెలుగవాళ్ల గొప్పతనం ఏంటి అనేది చెప్పడం జరిగింది.డాకు మహారాజ్ ఎలా ఉంటుంది అనేది ట్రైలర్ లో చూసారు. అసలుసిసలైన ట్రైలర్ ఈరోజే రిలీజ్ అయ్యింది. ఈ ట్రైలర్ కు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన వస్తుంది. ఇక నాతో పాటు చేసిన నటీనటులందరూ బాగా చేశారు. అందరి పాత్రలు చాలా బావున్నాయి. అన్ని ప్రాధాన్యత ఉన్న పాత్రలే. ప్రగ్యా జైస్వాల్, శ్రద్ధా శ్రీనాథ్ అద్భుతమైన పాత్రలు పోషించారు. ఊర్వశీ కేవలం సాంగ్ కు మాత్రమే కాదు.. యాక్షన్ సీన్స్ లో అదరగొట్టేసింది. కెమెరామెన్ విజయ్ కన్నన్ తన అద్భుతమైన వర్క్ చూపించాడు. థమన్, నా కాంబినేషన్ ఎంత హిట్టో చెప్పనవసరం లేదు.

యానిమల్ సినిమా తర్వాత అయన ఇమేజ్ ను దృష్టిలో పెట్టుకొనిబాబీ డియోల్ ని తీసుకున్నాం. ఆయన పాత్ర గురించి మేము ఎన్నో అనుకున్నాం. చివరికి మంచిగా వచ్చింది. అఖండ తరువాత నా ప్రస్థానం ఏంటో ఈ సినిమా రంగానికి చూపిస్తాను. ఏం చూసుకొని ఇంత అహంకారం అని అనుకుంటారు. నన్ను చూసే.. నా పదునైన పొగరు. చాలా సంతోషం ఆలా అంటే. ఎందుకంటే నాన్నగారే నాకు ఇన్స్పిరేషన్. అలాగే ప్రేక్షక దేవుళ్ళు. ఒక సినిమా పూర్తిచేసుకొని.. అది రిలీజ్ అయ్యి ఎలా ఉంటుందా అని నిద్రాహారాలు మాని ఉన్నప్పుడు.. వాటిని విజయవంతం చేసి.. వెన్ను తట్టి ఇలాంటి సినిమాలు ఇంకా ఇవ్వండి అని మమల్ని ప్రోత్సహిస్తున్న ఈ ప్రేక్షక దేవుళ్ళకు నేనెంతో రుణపడి ఉన్నాను. సంక్రాంతికి విడుదలైన నా సినిమాలన్నీ విజయం సాధించాయి. ఈ సంక్రాంతికి విడుదలవుతున్న డాకు మహారాజ్ కూడా ఘన విజయం సాధిస్తుంది. మీరు ఊహించిన దానికంటే మించే ఈ సినిమా ఉంటుంది. అందరికీ సంక్రాంతికి శుభాకాంక్షలు" అని ముగించారు.




## రిలీజ్ ట్రైలర్ విడుదల

**బలగం టీవీ, హైదరాబాద్**

డాకు మహారాజ్ సంక్రాంతి కానుకగా జనవరి 12న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలోనే మూవీ నుంచి రిలీజ్ ట్రైలర్‌ను విడుదల చేశారు మేకర్స్.



## నాపై విష ప్రయోగం జరిగింది : నోవాక్ జోకోవిచ్

**బలగం టీవీ, హైదరాబాద్**

టెన్నిస్ సూపర్ స్టార్, సెర్బియా ప్లేయర్ నోవాక్ జోకోవిచ్ సంచలన ఆరోపణలు చేశాడు. 2022 ఆస్ట్రేలియన్ ఓపెన్ సందర్భంగా తనను దేశం నుంచి బయటకు పంపించడానికి విష పూరిత ఆహారం పెట్టి నీచంగా ప్రవర్తించారని ఆరోపించాడు. తనకు పంపించిన భోజనలో విషపూరితమైన భార లోహాలైన లెడ్, మెర్క్యూరీలను పెద్దమొత్తంలో కలిపారని, దాంతో తను తీవ్రంగా ఇబ్బందులు పడ్డానని పేర్కొన్నాడు. చావు అంచుల నుంచి బయటపడ్డానని పేర్కొన్నాడు. 2022 ఆస్ట్రేలియన్ ఓపెన్ ఆడేందుకు వచ్చినప్పుడు జోకోవిచ్ కు ఈ చేదు అనుభవం ఎదురైంది. ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో ఆడేందుకు తను పెద్ద పోరాటమే చేసినా ఫలితం దక్కలేదు.

ఇక 2022 ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో పాల్గొనాలని ఎన్నో ఆశలతో మెల్‌బోర్న్‌లో అడుగుపెట్టిన జోకోవిచ్‌కు స్థానిక అధికారుల నుంచి చుక్కెదురైంది. కోవిడ్ టీకా వేసుకోని కారణంగా.. మెల్‌బోర్న్ హోటల్‌లో తనను నిర్బంధించారని, ఆ సమయంలో తనకు ఆరోగ్యపరమైన సమస్యలు ఉత్పన్నం అయ్యాయని, మెల్‌బోర్న్ హోటల్‌లో తనకు ఇచ్చిన ఆహారంలో కలుషితం ఉన్నట్లు గుర్తించానని జోకోవిచ్ అన్నాడు. సెర్బియాకు తిరిగి వచ్చిన తర్వాత కొన్ని గుర్తించానని, కానీ ఆ విషయాన్ని పబ్లిక్‌గా చెప్పలేదని, ఎందుకంటే తన శరీరంలో అధిక స్థాయిలో ఖనిజం ఉన్నట్లు గుర్తించానన్నాడు. తన బాడీలో అధిక మోతాదులో లెడ్, మెర్క్యూరీ ఉన్నట్లు తెలిపాడు. విషపూరిత ఆహారాన్ని ఇచ్చారా అని అడిగిన ప్రశ్నకు బదులిస్తూ.. అదొక్కటే మార్గంగా కనిపిస్తున్నట్లు అతను చెప్పాడు.

## హిందీ జాతీయ భాష కాదు

- **రవిచంద్రన్ అశ్విన్**

**బలగం టీవీ, హైదరాబాద్**




భారత దిగ్గజ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన కీలక వ్యాఖ్యలు చేశారు. ఓ కార్యక్రమంలో పాల్గొన్న అశ్విన్.. హిందీజాతీయ భాష కాదని వ్యాఖ్యానించారు. తమిళనాడు రాజధాని చెన్నైలోని ఓ ప్రైవేటు కళాశాల స్నాతకోత్సవానికి అశ్విన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అక్కడి విద్యార్థులతో సరదాగా ముచ్చటించారు. ఇంగ్లీష్, తమిళ్, హిందీ భాషల గురించి విద్యార్థులను ప్రశ్నించారు. అయితే, హిందీ భాష గురించి ఒకరిద్దరి నుంచి మాత్రమే సమాధానం వచ్చింది. దీనిపై స్పందించిన క్రికెటర్.. 'హిందీ అధికారిక భాష మాత్రమే. జాతీయ భాష కాదు' అంటూ వ్యాఖ్యానించారు. ప్రస్తుతం ఈ వ్యాఖ్యలు వైరల్‌గా మారాయి.

కాగా, రవిచంద్రన్ అశ్విన్ ఇటీవలే అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికిన విషయం తెలిసిందే. బోర్డర్-గవాస్కర్ ట్రోఫీలో భాగంగా బ్రిస్బేన్‌లో జరిగిన మూడవ టెస్టు చివరి రోజు అశ్విన్ తన రిటైర్మెంట్ ప్రకటించేశాడు. టెస్టు కెరీర్‌లో అత్యధిక వికెట్లు తీసిన రెండో బౌలర్‌గా నిలిచాడు అశ్విన్. అతను 106 టెస్టుల్లో 24 యావరేజ్‌లో 537 వికెట్లు తీసుకున్నాడు. అనిల్ కుంబ్లే తర్వాత రెండో స్థానంలో ఉన్నాడతను. కుంబ్లే 132 టెస్టుల్లో 619 వికెట్లు తీసిన విషయం తెలిసిందే. రికార్డు స్థాయిలో అశ్విన్ 11 సార్లు ప్లేయర్ ఆఫ్ ద సిరీస్ అవార్డును గెలుచుకున్నాడు. మేటి స్పిన్నర్ ముత్తయ్య మురళీధరన్‌తో సమానంగా నిలిచాడు.

## ఏపీలో బెనిఫిట్ షోలు రద్దు

**బలగం టీవీ, హైదరాబాద్**

సంక్రాంతి సందర్భంగా విడుదలవుతున్న టాలీవుడ్ సినిమాలకు ఏపీ ప్రభుత్వం టికెట్ల రేట్ల పెంపుతో పాటు ప్రత్యేక షోలకి అనుమతినిచ్చిన విషయం తెలిసిందే. ఇప్పటికే రామ్ చరణ్ నటించిన గేమ్ ఛేంజర్ ప్రేక్షకల ముందుకు వచ్చి సందడి చేస్తుండగా.. జనవరి 12న బాలకృష్ణ డాకు మహారాజ్, జనవరి 14న వెంకటేశ్ సంక్రాంతికి వస్తున్నాం ప్రేక్షకుల ముందుకు వస్తున్నాయి. అయితే ఈ సినిమా టికెట్ల ధరలకు సంబంధించి ఏపీ హైకోర్టు పరిమితులు విధించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే హైకోర్టు తీర్పు ఆధారంగా 'గేమ్ ఛేంజర్', 'డాకు మహారాజ్' సినిమా టికెట్ ధరల పెంపు, అదనపు షోలకు సంబంధించి ఏపీ ప్రభుత్వం వివరణతో పాటు కొత్త ఆదేశాలను జారీ చేసింది. తాజా ఆదేశాల ప్రకారం.. అర్ధరాత్రి 1 గంట, తెల్లవారుజామున 4 గంటలకు బెనిఫిట్ షోలకు అనుమతి నిరాకరించింది. అలాగే ఉత్తర్వుల ప్రకారం 10 రోజుల పాటు రోజుకు 5 షోలకు మించకుండా ప్రదర్శించుకోవాలని ఆదేశాలు జారీ చేసింది. ఇక తాజాగా జారీ చేసిన జీవోలో సంక్రాంతికి వస్తున్న డాకు మహారాజ్‌తో పాటు సంక్రాంతికి వస్తున్నాం సినిమాలకు 4 గంటల బెనిఫిట్ షోను రద్దు చేసింది. అయితే డాకు మహారాజ్ సినిమాకి కొన్ని చోట్ల 4 గంటల షోకి సంబంధించి అడ్వాన్స్ బుకింగ్ ఓపెన్ అయ్యాయి. మరి అవి క్యాన్సిల్ చేస్తారా అనేది తెలియాల్సి ఉంది.